

విజన్ పక్షం

PRGI.TGBIL/26/A0206



కోల్‌కతా దుర్గా పూజలో పెను విషాదం..
తొక్కిసలాటలో 19 మంది భక్తుల మృతి


సంపుటి:-01, సంచిక:-142, సోమవారం 19-10-2026, పేజీలు:-4, వెల: 2/-, ఎడిటర్:- ఎల్లని రాజేశ్వర్ గౌడ్ , పబ్లిషర్స్ : తెలంగాణ , ఆంధ్రప్రదేశ్

తెలంగాణ నీళ్లను తరలించే కుట్ర

- చంద్రబాబు ప్లాన్‌కు రేవంత్ సహకారం: హరీశ్‌రావు
- తెలంగాణలో కరవు పరిస్థితులకు ప్రభుత్వమే కారణమని ఆరోపణ
- దేవాదులలో 10 మోటార్లకు మూడు మాత్రమే నడుస్తున్నాయని విమర్శ
- గోదావరి జలాల తరలింపునకు చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని ఆరోపణ
- గోదావరి-కావేరి అనుసంధాన ప్రతిపాదనపై హరీశ్‌రావు అభ్యంతరం
- తెలంగాణ నీటి ప్రయోజనాల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా ఉందని విమర్శ



తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు తీవ్ర విమర్శలు చేశారు. రాష్ట్ర ప్రయోజనాలను దెబ్బతీస్తూ తెలంగాణ సమాజానికి తీరని ద్రోహం చేస్తున్నారని ఆరోపించారు.



ఎల్ నినో ఎఫెక్ట్: కరెంట్, నీళ్లు పొదుపుగా వాడాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క విజ్ఞప్తి

- ఎల్ నినో ప్రభావంపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆందోళన
- విద్యుత్, నీటిని పొదుపుగా వినియోగించాలని ప్రజలకు విజ్ఞప్తి
- రాష్ట్రంలో 20,000 మెగావాట్లకు చేరిన విద్యుత్ డిమాండ్
- గతంలో చలిగా ఉండే అక్టోబర్‌లోనూ ఇప్పుడు ఎండల తీవ్రత
- వాతావరణ మార్పుల వల్లే ఈ పరిస్థితి నెలకొందన్న భట్టి

రాష్ట్రంలో ఎల్ నినో ప్రభావంతో వాతావరణ పరిస్థితులు ప్రతికూలంగా మారిన నేపథ్యంలో, ప్రజలు విద్యుత్తు, నీటిని అత్యంత పొదుపుగా వినియోగించుకోవాలని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క విజ్ఞప్తి చేశారు. మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా సహజ వనరులను బాధ్యతాయుతంగా వినియోగించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఆయన స్పష్టం చేశారు. శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన 'బతుకమ్మ యంగ్ ఫిల్మ్ మేకర్స్ అవార్డ్స్' ప్రదానోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు పురస్కారాలను అందజేశారు.

గురువు కోమటిరెడ్డి కోసం తలైనా ఇస్తా

- కానీ నీళ్ల కోసం యుద్ధమే: ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి
- ఏడుల నుంచి డిండికి నీటిని తరలించడాన్ని అంగీకరించేది లేదన్న అనిరుధ్ రెడ్డి
- పాలమూరు నీళ్ల కోసం గురువునైనా ఎదిరిస్తానని వ్యాఖ్య
- తనకు పాలమూరు ప్రయోజనాలే ముఖ్యమన్న అనిరుధ్



అవసరమైతే ఆర్టీసీ భూములు అమ్మి అయినా చెల్లింపులు పూర్తి చేస్తాం

- రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగుల బకాయిలు త్వరలో చెల్లిస్తామని మంత్రి పొన్నం హామీ
- అవసరమైతే ఆర్టీసీ భూములు అమ్మి అయినా చెల్లింపులు పూర్తి చేస్తామని వెల్లడి
- సీసీఎస్ బకాయిల పరిష్కారానికి కూడా ప్రభుత్వం కృషి చేస్తోందని వెల్లడి



తెలంగాణ ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులకు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కీలక భరోసా ఇచ్చారు. వారి పెండింగ్ బకాయిలను- మిగతా 2 లో

పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ

- తెలంగాణకు రేపటి నుంచి వర్ష సూచన..
- ఉరుములు, మెరుపులతో పాటు ఈదురుగాలుల హెచ్చరిక
- ఉత్తర తమిళనాడు తీరంపై కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం
- హైదరాబాద్ సహా అనేక జిల్లాలకు ఎల్లో వార్నింగ్ జారీ



యూపీలో యోగి హవా సర్వేలో స్పష్టమైన
ఆధిక్యం విపక్షాలకు షాక్



- యూపీ తదుపరి సీఎంగా యోగి ఆదిత్యనాథ్‌కే ప్రజల మొగ్గు
- యోగికి 66.2 శాతం, అఖిలేష్ యాదవ్‌కు 24.4 శాతం మద్దతని సర్వేలో వెల్లడి
- యోగి ప్రభుత్వ పనితీరుపై 77 శాతం మందికి పైగా సంతృప్తి
- శాంతిభద్రతలే కీలక ఎన్నికల అంశమని తెలిపిన ఓటర్లు
- ఎన్డీఏకు 66.6 శాతం, ఎస్పీ-కాంగ్రెస్ కూటమికి 26.4 శాతం ఓట్లని అంచనా

ఘోర బస్సు ప్రమాదం

లోయలో పడిన వాహనం, 8 మంది మృతి!



- రాజస్థాన్‌లో బస్సు ప్రమాదంలో ఎనిమిది మంది మృతి
- మృతుల్లో ఐదుగురు మహిళలు, మరో 17 మందికి గాయాలు
- భోపాల్ నుంచి ఖాటూ శ్యామ్‌కు వెళ్తుండగా ప్రమాదం
- డ్రైవర్ నిద్ర మత్తుతో బస్సు అదుపు తప్పినట్లు ప్రాథమిక సమాచారం
- క్షతగాత్రులకు కోటాలోని రెండు ఆసుపత్రుల్లో చికిత్స- మిగతా 2 లో

బలూచిస్థాన్‌లో ఉద్రిక్తత: 20 మంది పోలీసుల కిడ్నాప్



- బలూచిస్థాన్‌లో 20 మంది పోలీస్ రిక్రూట్‌లను అపహరించిన సాయుధులు
- ఇది బలోచ్ వేర్పాటువాదుల పనేనని అనుమానం
- రాష్ట్రంలో బలవంతపు అదృశ్యాలు, కస్టడీ మరణాలపై తీవ్ర ఆరోపణలు
- పాక్ భద్రతా బలగాల ఆధీనంలో పలువురు టీచర్ల మృతి చెందినట్లు ఆరోపణలు- మిగతా 2 లో

రిలయన్స్‌తో
పోటీకి సై

- స్టార్‌లింక్ సిద్ధమంటూ మస్క్ ప్రకటన! రిలయన్స్ ప్రకటనపై 'ఎంతో అభినందిస్తున్నా' అంటూ మస్క్ స్పందన
- భారత్‌లో హైస్పీడ్ ఇంటర్నెట్ సేవలకు సిద్ధమన్న స్టార్‌లింక్
- దేశంలో ప్రత్యేక మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడి
- ఐదేళ్లుగా భారత నియంత్రణ సంస్థలతో కలిసి పనిచేస్తున్న సంస్థ
- స్టార్‌లింక్ సేవల ప్రారంభానికి మరికొన్ని ప్రభుత్వ అనుమతుల అవసరం


భారత్‌లో స్టార్‌లింక్ సేవలు- మిగతా 2 లో

రష్యా ఆంక్షల చట్టంపై ట్రంప్ అనూహ్య నిర్ణయం

భారత్‌కు భారీ ఊరట!

- రష్యాపై కఠిన ఆంక్షల చట్టానికి ట్రంప్ మినహాయింపు
- భారత్, చైనా వంటి దేశాలకు తప్పిన పెను ముప్పు
- రష్యా ఇంధనాన్ని దిగుమతి చేసుకునే దేశాలపై ప్రభావం నివారణ
- జాతీయ ప్రయోజనాల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడి
- అమల్లోకి రావడానికి ఒక రోజు ముందు కీలక ఉత్తర్వులు

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. రష్యా, ఇరాన్‌లను లక్ష్యంగా చేసుకుని రూపొందించిన కఠినమైన చట్టంలోని



పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ

మొదటిపేజీ తరువాయి – తెలంగాణలో రానున్న రోజుల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. రేపు, ఎల్లుండి రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడతాయని, కొన్నిచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన జల్లులు కురిసే అవకాశముందని తెలిపింది. ఈ మేరకు హైదరాబాద్ వాతావరణ కేంద్రం పలు జిల్లాలకు ఎల్లో వార్నింగ్ జారీ చేసింది. ఉత్తర తమిళనాడు, దానిని ఆనుకుని ఉన్న దక్షిణ కోస్తాంధ్ర ప్రాంతాల్లో సముద్ర మట్టానికి 4.5 నుంచి 5.8 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. దీని ప్రభావంతో తెలంగాణలో రానున్న మూడు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని అధికారులు అంచనా వేస్తున్నారు. వర్షంతో పాటు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు కూడా వీచే అవకాశం ఉందని హెచ్చరించారు. రేపు (అక్టోబర్ 18) హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, మహబూబ్‌నగర్, నల్గొండ, సూర్యాపేట, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం సహా పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు. వర్షాల నేపథ్యంలో, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ అధికారులు సూచించారు.

తెలంగాణ నీళ్లను తరలించే కుట్ర

మొదటిపేజీ తరువాయి – రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టుల్లో నీళ్లు లేకుండా చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఎలనినో పేరుతో ప్రభుత్వం చేతులెత్తేస్తోందని మండిపడ్డారు. అత్యంత కీలకమైన సాగునీటి విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఏంటని ప్రశ్నించారు. తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన.. రాష్ట్రంలో నెలకొన్న కరవు పరిస్థితులకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వమే కారణమని ఆరోపించారు. దేవాదుల ప్రాజెక్టులో 10 మోటార్లు అందుబాటులో ఉన్నప్పటికీ మూడు మాత్రమే నడిపిస్తున్నారని హరీశ్‌రావు విమర్శించారు. తాము అభ్యంతరాలు వ్యక్తం చేసిన తర్వాతే ప్రభుత్వం స్పందించిందని అన్నారు. తెలంగాణతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్‌లో తక్కువ వర్షపాతం నమోదైనా అక్కడ కరవు పరిస్థితులు, పంటల సాగుకు విరామం ప్రకటించే పరిస్థితి లేదని పేర్కొన్నారు. తెలంగాణలో మాత్రం రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. గోదావరి జలాలను ఇతర ప్రాంతాలకు తరలించేందుకు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని హరీశ్‌రావు ఆరోపించారు. గోదావరి-కావేరి అనుసంధానం పేరుతో తెలంగాణ నీటిని తరలించే ప్రతిపాదనలకు రేవంత్‌రెడ్డి సహకరిస్తున్నారని విమర్శించారు. గతంలో గోదావరి-బనకచర్ల, గోదావరి-నల్లమలసాగర్ ప్రతిపాదనలు ముందుకు సాగలేదని, ఇప్పుడు గోదావరి-కావేరి అనుసంధానం పేరుతో కొత్త ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఏపీ నేతలు ఇలాంటి ప్రతిపాదనలు చేయలేదని హరీశ్‌రావు పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాతే ఏపీ పాలకులు కొత్త ప్రతిపాదనలను తెరపైకి తెస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ నీటి ప్రయోజనాలను కాపాడటంలో ప్రభుత్వం విఫలమవుతోందని విమర్శించారు.

గురువు కోమటిరెడ్డి కోసం తలైనా ఇస్తా

మొదటిపేజీ తరువాయి – జడ్చర్ల కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. తన రాజకీయ గురువైన మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కోసం తన తలనైనా నరుక్కుంటానని... కానీ పాలమూరు ప్రాంత నీటి హక్కుల విషయంలో మాత్రం రాజీ పడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. నీళ్ల కోసం అవసరమైతే గురువుతోనైనా యుద్ధం చేస్తానని, తన ప్రాంత ప్రయోజనాలే తనకు ముఖ్యమని తేల్చిచెప్పారు. జడ్చర్లలోని తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. పాలమూరు-రంగారెడ్డి, డిండి ఎత్తిపోతల పథకాల మధ్య నీటి కేటాయింపుల వివాదంపై ఆయన తన వైఖరిని స్పష్టం చేశారు. ఏదుల రిజర్వాయర్ నుంచి డిండి ప్రాజెక్టుకు నీటిని తరలించే ప్రతిపాదనను ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోమని అన్నారు. ముందుగా పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు ద్వారా పాలమూరుకు నీరందించాకే, దిండికి నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పనులు కేవలం 60 శాతమే పూర్తయ్యాయని అనిరుధ్ రెడ్డి ఆరోపించారు. ఈ ప్రాజెక్టు పూర్తి కోసం జేపీసీ తలపెట్టిన జలదీక్షకు తన సంపూర్ణ మద్దతు ఉంటుందని ప్రకటించారు. ప్రాజెక్టు సాధన కోసం పాలమూరు ఎమ్మెల్యేలంతా ఐక్యంగా పోరాడతామని చెప్పారు. అదే సమయంలో, ప్రతి అంశానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని అనవసరంగా లక్ష్యంగా చేసుకోవద్దని ఆయన హితవు పలికారు.

రిలయన్స్‌తో పోటీకి సై

మొదటిపేజీ తరువాయి – ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నామని ఆ సంస్థ ప్రకటించింది. రిలయన్స్ ఇండస్ట్రీస్ పోటీపై చేసిన ప్రకటనకు స్పందిస్తూ ఈ విషయాన్ని వెల్లడించింది. దీనిపై ఎలాన్ మస్క్ 'ఎంతో అభినందిస్తున్నా' అంటూ 'ఎక్స్'లో స్పందించారు. భారత మార్కెట్‌లో స్టార్‌లింక్ ప్రవేశంపై మస్క్, రిలయన్స్ మధ్య ఇటీవల మాటల యుద్ధం నడిచిన నేపథ్యంలో తాజా పరిణామం ప్రాధాన్యం సంతరించుకుంది. స్టార్‌లింక్ భారత్‌లో ఐదేళ్లకు పైగా ప్రభుత్వ నియంత్రణ సంస్థలు, పరిశ్రమలు, టెలికాం ఆపరేటర్లతో కలిసి పనిచేస్తోందని తెలిపింది. భారత వినియోగదారులకు సురక్షితంగా సేవలు అందించేందుకు దేశంలోనే ప్రత్యేక వ్యవస్థలు, గేట్‌వేలు, ఇతర మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించింది. వీటికి అవసరమైన ప్రభుత్వ అనుమతులు ఉన్నాయని పేర్కొంది. భారత్‌కు హైస్పీడ్ ఇంటర్నెట్ అందించేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేసింది. శాటిలైట్ కమ్యూనికేషన్ల రంగంలో స్టార్‌లింక్ సహా అన్ని సంస్థల పోటీని స్వాగతిస్తున్నట్లు రిలయన్స్ శుక్రవారం ప్రకటించింది. భారతీయ సంస్థలైనా, విదేశీ కంపెనీలైనా దేశ చట్టాలు, విధానాలను పాటించాల్సిందేనని స్పష్టం చేసింది. జియో శాటిలైట్ సేవలు కూడా అనుమతుల కోసం ఎదురుచూస్తున్నాయని తెలిపింది. ఈ పరిణామాలకు ముందు మస్క్.. రిలయన్స్ అధినేత ముకేశ్ అంబానీపై విమర్శలు చేసిన విషయం తెలిసిందే. భారత్‌లో గుత్తాధిపత్యాన్ని కొనసాగించాలని చూస్తున్నారంటూ ఎక్స్‌లో వ్యాఖ్యానించారు. అంబానీని 'భారత్‌కు అసలైన అధిపతి' అంటూ వ్యంగ్యంగా సంబోధించారు. స్టార్‌లింక్‌ను భారత మార్కెట్‌లో పోటీ పడనిస్తారా? అని ప్రశ్నించారు. భారత్‌లో శాటిలైట్ కమ్యూనికేషన్ సేవలు అందించేందుకు స్టార్‌లింక్ లైసెన్స్ పొందినప్పటికీ, వాణిజ్యపరంగా సేవలు ప్రారంభించేందుకు భద్రతాపరమైన అనుమతులు సహా మరికొన్ని ప్రభుత్వ ఆమోదాలు రావాల్సి ఉంది.

యూపీలో యోగి హవా.. సర్వేలో స్పష్టమైన ఆధిక్యం.. విపక్షాలకు షాక్



మొదటిపేజీ తరువాయి – ఉత్తరప్రదేశ్‌లో 2027 అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా సమయం ఉన్నప్పటికీ, రాష్ట్ర రాజకీయ ముఖచిత్రాన్ని అంచనా వేస్తూ 'న్యూస్18 యూపీ' నిర్వహించిన మెగా సర్వేలో ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌కు తిరుగులేని ఆధిక్యం లభించింది. తదుపరి ముఖ్యమంత్రిగా యోగీనే ఉండాలని సర్వేలో పాల్గొన్న వారిలో 66.2 శాతం మంది అభిప్రాయపడగా, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్‌కు కేవలం 24.4 శాతం మద్దతు మాత్రమే లభించింది. 'పీవాల్యూ అనలిటిక్స్'తో కలిసి 'న్యూస్18' ఈ సర్వే నిర్వహించింది. ఇందులో భాగంగా యూపీలోని 75 జిల్లాల్లో సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2, 2026 మధ్య 30,925 మంది అభిప్రాయాలను సేకరించారు. ఈ సర్వేలో బీఎస్పీ అధినేత్రి మాయావతికి 5 శాతం, చంద్రశేఖర్ ఆజాద్‌కు 1.8 శాతం మంది మద్దతు తెలిపారు. యోగి ప్రభుత్వ పనితీరుపై ఏకంగా 77.1 శాతం మంది సంతృప్తి వ్యక్తం చేయడం గమనార్హం. వీరిలో 52.8 శాతం చాలా సంతృప్తిగా, 24.3 శాతం కొంతమేర సంతృప్తిగా ఉన్నట్లు చెప్పారు. శాంతిభద్రతల విషయంలో 74 శాతం, మౌలిక సదుపాయాలపై 68.6 శాతం మంది సంతృప్తి వ్యక్తం చేశారు. అయితే, ఉపాధి కల్పన విషయంలో ప్రభుత్వ పనితీరు బలహీనంగా ఉందని సర్వే సూచించింది. అయినప్పటికీ, 58.3 శాతం మంది ఉపాధి విషయంలో సంతృప్తిగానే ఉన్నామని తెలిపారు. ఓటింగ్ విషయానికొస్తే, బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమికి 66.6 శాతం మంది ఓటేస్తామని చెప్పగా, ఎస్పీ-కాంగ్రెస్ కూటమికి 26.4 శాతం మద్దతు పలికారు. రాష్ట్రంలో శాంతిభద్రతలే అత్యంత కీలకమైన ఎన్నికల అంశమని 33.4 శాతం మంది పేర్కొన్నారు. యోగికి కేవలం బీజేపీ మద్దతుదారులే కాకుండా, ఎస్పీ-కాంగ్రెస్ కూటమి మద్దతుదారుల్లో 11.7 శాతం మంది, బీఎస్పీ మద్దతుదారుల్లో 10.2 శాతం మంది కూడా తదుపరి సీఎంగా ఆయన వైపు మొగ్గు చూపడం విశేషం.

బలూచిస్థాన్‌లో ఉద్రిక్తత: 20 మంది పోలీసుల కిడ్నాప్



మొదటిపేజీ తరువాయి – పాకిస్థాన్‌లోని బలూచిస్థాన్ ప్రావిన్స్‌లో మరోసారి తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. బలోచ్ వేర్పాటువాదులుగా అనుమానిస్తున్న కొందరు సాయుధులు, శిక్షణలో ఉన్న 20 మంది పోలీసు సిబ్బందిని అపహరించారు. శుక్రవారం సాయంత్రం మస్తుంగ్ జిల్లాలోని గోర్గినా ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకుంది. కలాత్ రిక్రూట్ ట్రైనింగ్ సెంటర్ నుంచి సెలవుపై తమ స్వగ్రామాలకు వెళుతున్న పోలీస్ రిక్రూట్‌లు ప్రయాణిస్తున్న వ్యాన్‌ను సాయుధులు అడ్డగించి, వారిని కిడ్నాప్ చేశారు. ఈ ఘటనతో అప్రమత్తమైన పాకిస్థాన్ భద్రతా బలగాలు, అపహరణకు గురైన పోలీసుల ఆచూకీ కోసం భారీ గాలింపు చర్యలు చేపట్టాయి. మస్తుంగ్ జిల్లా వ్యాప్తంగా చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి భద్రతను కట్టుదిట్టం చేశాయి. ఇదే క్రమంలో, టర్బత్ సమీపంలో కొన్ని సరుకు రవాణా ట్రక్కులకు కూడా బలోచ్ వేర్పాటువాదులు నిప్పుపెట్టినట్లు సమాచారం. ఈ ఘటనలపై దర్యాప్తు కొనసాగుతోంది.

తెరపైకి కస్టడీ మరణాల ఆరోపణలు

ఈ దాడుల నేపథ్యంలో, బలూచిస్థాన్‌లో సుదీర్ఘ కాలంగా పాక్ భద్రతా దళాలపై వస్తున్న బలవంతపు అదృశ్యాలు, కస్టడీ మరణాల ఆరోపణలు మరోసారి చర్చనీయాంశమయ్యాయి. ఇటీవలే, పర్వేజ్ అనే పాఠశాల ఉపాధ్యాయుడి మృతదేహం పాస్నిలో లభ్యమైంది. అంతకు ఒకరోజు ముందు, కుటుంబ సభ్యుల సమక్షంలోనే పాక్ భద్రతా దళాలు అతన్ని అదుపులోకి తీసుకున్నాయని 'ది బలూచిస్థాన్ పోస్ట్' కథనం ప్రచురించింది. పర్వేజ్ అరెస్టు, మరణంపై పాక్ అధికారులు ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. ఈ ఏడాది ఇలాంటి ఘటనలు పెరిగాయని మానవ హక్కుల సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఆగస్టులో, పంజ్‌గూర్‌కు చెందిన హాతిమ్ బలోచ్ అనే మరో ఉపాధ్యాయుడిని గుర్తుతెలియని వ్యక్తులు అపహరించగా, కొన్ని వారాల తర్వాత ఆయన మృతదేహం లభ్యమైంది. అదేవిధంగా, గత ఏడాది అక్టోబర్‌లో పాక్ బలగాలు అదుపులోకి తీసుకున్న అయాజ్ బలోచ్ అనే ఉపాధ్యాయుడి మృతదేహం ఈ ఏడాది జనవరిలో లభించింది.

నివేదికలో సంచలన విషయాలు

'బలోచ్ యక్‌జెహతీ కమిటీ (బీవైసీ)' విడుదల చేసిన నివేదిక ప్రకారం, 2026 జనవరి నుంచి జూన్ వరకు బలూచిస్థాన్‌లో 507 బలవంతపు అదృశ్యాలు నమోదయ్యాయి. వీరిలో 135 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు, పరిశోధకులు ఉండటం గమనార్హం. వీరిలో 32 మంది కస్టడీలోనే మరణించారని ఆ సంస్థ ఆరోపించింది. తాజాగా కిడ్నాప్ ఘటన జరిగిన మస్తుంగ్ జిల్లాలోనే అక్టోబర్ 9న ఓ ఇంటిపై డ్రోన్ దాడి జరగగా ఇద్దరు పౌరులు గాయపడ్డారు. జనవాసాలపై పాక్ సైన్యం డ్రోన్లు, ఫైటర్ జెట్లతో దాడులు చేస్తూ పౌరుల ప్రాణాలకు ముప్పు కలిగిస్తోందని బీవైసీ ఆరోపించింది. ఒకవైపు వేర్పాటువాదుల దాడులు, మరోవైపు భద్రతా దళాలపై వస్తున్న తీవ్ర ఆరోపణలతో బలూచిస్థాన్‌లో సామాన్య పౌరుల భద్రత ప్రశ్నార్థకంగా మారింది.

ఘోర బస్సు ప్రమాదం



మొదటిపేజీ తరువాయి – ఢిల్లీ-ముంబయి ఎక్స్‌ప్రెస్‌వేపై ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. ప్రయాణికులతో వెళ్తున్న బస్సు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న లోయలో పడిపోయింది. ఈ ఘటనలో ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 17 మంది గాయపడ్డారు. రాజస్థాన్‌లోని కోటా సమీపంలో శనివారం తెల్లవారుజామున ఈ ప్రమాదం జరిగింది. పోలీసుల సమాచారం ప్రకారం.. బస్సులో 27 మంది ప్రయాణిస్తున్నారు. మధ్యప్రదేశ్‌లోని భోపాల్ నుంచి రాజస్థాన్‌లోని ఖాటూ శ్యామ్ ఆలయానికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ప్రాథమిక సమాచారం ప్రకారం.. డ్రైవర్ నిద్ర మత్తు వల్లే బస్సు అదుపు తప్పింది. రక్షణ కంచెను ఢీకొట్టి లోయలో పడిపోయింది. ఈ ప్రమాదంలో మరణించిన ఎనిమిది మందిలో ఐదుగురు మహిళలు ఉన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదంలో గాయపడిన 17 మందిని కోటాలోని ఎంబీఎస్ ఆసుపత్రి, న్యూ మెడికల్ కాలేజీ ఆసుపత్రులకు తరలించారు. క్షతగాత్రులకు వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం ఎవరి పరిస్థితీ విషమంగా లేదని అధికారులు తెలిపారు. ప్రమాద సమాచారం ఉదయం 8 గంటల సమయంలో అందినట్లు వెల్లడించారు. కోటా జిల్లా కలెక్టర్ పీయూష్ సమారియా, ఐజీ హరేంద్ర మహావర్ ఎంబీఎస్ ఆసుపత్రికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. అందుబాటులో ఉన్న నాలుగు అంబులెన్సులనూ ప్రమాద స్థలానికి పంపించారు. క్షతగాత్రులను వీలైనంత త్వరగా ఆసుపత్రులకు తరలించేందుకు చర్యలు చేపట్టారు.

రష్యా ఆంక్షల చట్టంపై ట్రంప్ అనూహ్య నిర్ణయం

మొదటిపేజీ తరువాయి – పలు కీలక నిబంధనలకు మినహాయింపునిస్తూ శుక్రవారం రాత్రి ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ జారీ చేశారు. 'లిండ్సే ఓ. గ్రాహం శాంక్షనింగ్ రష్యా అండ్ ఇరాన్ యాక్ట్ ఆఫ్ 2026'గా పిలిచే ఈ చట్టం అమల్లోకి రావడానికి కేవలం ఒక రోజు ముందు ట్రంప్ ఈ నిర్ణయం తీసుకోవడం అంతర్జాతీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ చర్య ద్వారా రష్యా నుంచి భారీగా ఇంధనాన్ని దిగుమతి చేసుకుంటున్న భారత్, చైనా వంటి దేశాలకు తక్షణమే భారీ ఊరట లభించినట్లయింది.

ఏమిటీ చట్టం? దాని ప్రభావం ఎంత?

సెప్టెంబర్ 18న ట్రంప్ సంతకం చేసిన ఈ చట్టం, రష్యా ఆర్థిక వ్యవస్థను దెబ్బతీయడమే లక్ష్యంగా రూపొందించబడింది. ఈ చట్టంలోని నిబంధనలు అమల్లోకి వస్తే, రష్యా నుంచి అత్యధికంగా ముడి చమురు, సహజ వాయువును కొనుగోలు చేసే దేశాల నుంచి వచ్చే వస్తువులపై 100% వరకు టారిఫ్‌లు విధించే అధికారం అమెరికాకు లభిస్తుంది. అదేవిధంగా, రష్యా ఇంధన ఉత్పత్తులపై అధిక సుంకాలు, ఆంక్షల ఉల్లంఘనకు సహకరించే దేశాలపై కఠిన చర్యలు తీసుకునేందుకు వీలు కలుగుతుంది. ప్రపంచంలో రష్యా చమురుకు అతిపెద్ద కొనుగోలుదారులుగా ఉన్న భారత్, చైనాలపై ఈ చట్టం తీవ్ర ప్రభావం చూపిస్తుందని ముందునుంచే ఆందోళనలు వ్యక్తమయ్యాయి. తాజా మినహాయింపుతో ఆ దేశాలపై పడాల్సిన ఆర్థిక భారం ప్రస్తుతానికి తప్పింది.

జాతీయ ప్రయోజనాల కోసమేనన్న ట్రంప్

అమెరికా జాతీయ ప్రయోజనాల దృష్ట్యానే ఈ మినహాయింపు నిర్ణయం తీసుకుంటున్నట్లు ట్రంప్ తన ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌లో పేర్కొన్నారు. ఈ మేరకు అవసరమైన నివేదికను, ధృవీకరణ పత్రాన్ని అమెరికా కాంగ్రెస్‌కు సమర్పించారు. ఈ ఉత్తర్వుల ద్వారా చట్టంలోని సెక్షన్ 112, 113 కింద విధించాల్సిన సుంకాలను, రష్యా ఇంధన కార్యకలాపాలతో సంబంధం ఉన్న విదేశీ సంస్థలు, వ్యక్తులపై విధించాల్సిన పలు ఆంక్షలను తక్షణమే నిలిపివేశారు. అయితే, ఈ మినహాయింపు కేవలం తాత్కాలికమేనని, భవిష్యత్తులో అవసరమైతే ఈ ఆంక్షలను పునరుద్ధరించే అధికారం అధ్యక్షుడికి ఉంటుందని స్పష్టమవుతోంది.

భారత్ వాదనకు బలం

ట్రంప్ నిర్ణయం భారత్‌కు వ్యూహాత్మకంగా పెద్ద ఊరట. తన ఇంధన భద్రత అవసరాల కోసం వివిధ దేశాల నుంచి ఇంధనాన్ని సేకరించడం తప్పనిసరి అని భారత్ మొదటి నుంచి అమెరికాతో జరిపిన చర్చల్లో బలంగా వాదిస్తూ వస్తోంది. రష్యా నుంచి చమురు కొనుగోళ్లు కేవలం తమ ఇంధన అవసరాలను తీర్చుకోవడానికేనని స్పష్టం చేసింది. ఇప్పుడు ట్రంప్ తీసుకున్న నిర్ణయం పరోక్షంగా భారత్ వాదనకు బలం చేకూర్చినట్లయింది. రష్యాతో అమెరికా చర్చలు జరుపుతున్న తరుణంలో, అలాగే ఉక్రెయిన్ నాయకత్వంపై విమర్శలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం. ప్రస్తుతానికి ఈ మినహాయింపుతో భారత్, చైనాలు ఊపిరి పీల్చుకున్నప్పటికీ, అమెరికా భవిష్యత్ వైఖరిపైనే తదుపరి పరిణామాలు ఆధారపడి ఉంటాయి.

భూమాతకు జ్వరం!.. ప్రమాదకర స్థాయికి ఏడు కీలక సూచికలు

మొదటిపేజీ తరువాయి – నేతృత్వంలోని అంతర్జాతీయ నిపుణుల బృందం రూపొందించిన '2026 స్టేట్ ఆఫ్ ది క్లైమేట్ రిపోర్ట్' ఈ చేదు నిజాలను వెలుగులోకి తెచ్చింది. ప్రతిష్ఠాత్మక 'బయోసైన్స్' జర్నల్‌లో ఈ నివేదిక ప్రచురితమైంది. మానవ శరీరంలోని రక్తపోటు, నాడీ చలనం వంటి 16 ప్రాణాధారాలను పరీక్షించినట్లే, భూమి ఆరోగ్యానికి సంబంధించిన కీలక సూచికలను (వైటల్ సైన్స్) శాస్త్రవేత్తలు విశ్లేషించారు. వీటిలో ఏడు సూచికలు మునుపెన్నడూ లేనంత గరిష్ఠ స్థాయికి చేరాయని, మిగిలినవి కూడా ప్రతికూల దిశలో పయనిస్తున్నాయని నివేదిక స్పష్టం చేసింది.

నివేదికలోని కీలక అంశాలు

2026 మే నాటికి వాతావరణంలో కార్బన్ డయాక్సైడ్ (జూ2) స్థాయి 428 పార్ట్స్ పర్ మిలియన్ (జూజూఎ)కు చేరింది. ఇది పారిశ్రామిక విప్లవానికి ముందు నాటి స్థాయుల కంటే 50 శాతం అధికం కాగా, గత 20 లక్షల సంవత్సరాలలో ఇదే అత్యధికం. కార్బన్ డయాక్సైడ్ కంటే 28-36 రెట్లు ఎక్కువ వేడిని బంధించే మీథేన్ (జఒ4), 265-298 రెట్లు శక్తివంతమైన నైట్రస్ ఆక్సైడ్ (ఒ2ఆ) కూడా రికార్డు స్థాయిలకు చేరుకున్నాయి. ఇంధన సంబంధిత కార్బన్ ఉద్గారాలు తొలిసారిగా 41 గిగాటన్నులను దాటాయి.

వీటితో పాటు సముద్ర మట్టాలు, సముద్ర గర్భంలోని ఉష్ణోగ్రతలు, కరిగిపోతున్న గ్లేసియర్లు, గ్రీన్‌లాండ్ మంచు ఫలకం ద్రవ్యరాశి వంటివి కూడా ఆందోళనకర రీతిలో రికార్డులు సృష్టిస్తున్నాయి. సముద్రాలు అపూర్వమైన స్థాయిలో వేడిని గ్రహించడం వల్ల ఉపరితల జలాలు వేడెక్కి 'సూపర్ ఎల్ నినో' వంటి తీవ్రమైన వాతావరణ పరిస్థితులకు కారణమవుతున్నాయని శాస్త్రవేత్తలు తెలిపారు.

భూతాపం రేటు కూడా వేగవంతమవుతోంది. 1970-2010 మధ్య దశాబ్దానికి 0.19ళీ సెంటీగ్రేడ్‌గా ఉన్న పెరుగుదల, ఇటీవలి కాలంలో 0.36ళీ సెంటీగ్రేడ్‌కు పెరిగింది. ఈ నేపథ్యంలో 2026 సంవత్సరం చరిత్రలోనే అత్యంత వేడి సంవత్సరాల్లో ఒకటిగా నిలిచే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

ఆశాకిరణాలు.. హెచ్చరికలు

ఈ ఆందోళనకర పరిస్థితుల మధ్య కొన్ని ఆశాజనక పరిణామాలు కూడా ఉన్నాయి. బ్రెజిల్ అమెజాన్‌లో అటవీ నిర్మూలన వరుసగా నాలుగో ఏడాది తగ్గడం, సౌర, పవన విద్యుత్ వినియోగం 18 శాతం పెరగడం వంటివి సానుకూల అంశాలు. అయినప్పటికీ, 'యథాతథ వ్యాపార' ధోరణిని వీడి, తక్షణమే చర్యలు చేపట్టాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు. "వేగవంతమైన అస్థిరత అనేది ఇక భవిష్యత్తు హెచ్చరిక కాదు, అది ప్రస్తుత నిర్ధారణ" అని నివేదిక సహ-రచయిత విలియం రిపుల్ వ్యాఖ్యానించారు. ఈ మార్పులు భూమిని కోలుకోలేని 'టిప్పింగ్ పాయింట్ల' వైపు నెడుతున్నాయని నివేదిక హెచ్చరించింది.

అవసరమైతే ఆర్టీసీ భూములు అమ్మి అయినా చెల్లింపులు పూర్తి చేస్తాం



మొదటిపేజీ తరువాయి – వీలైనంత త్వరగా చెల్లించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, ఈ చెల్లింపుల కోసం అవసరమైతే విలువైన ఆర్టీసీ భూములను విక్రయించేందుకైనా సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. ఇటీవల జరిగిన ఆర్టీసీ కార్మిక సంఘాల గుర్తింపు ఎన్నికల్లో గెలుపొందిన యునైటెడ్ ఫ్రంట్ నేతలతో పొన్నం ప్రభాకర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా విజేతలను అభినందించిన ఆయన... రిటైర్డ్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న బకాయిల సమస్యను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ (సీసీఎస్) బకాయిలతో పాటు, ఆర్టీసీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న ఇతర పెండింగ్ సమస్యలను కూడా పరిష్కరించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని పొన్నం ప్రభాకర్ వివరించారు. దీర్ఘకాలంగా పేరుకుపోయిన రిటైర్మెంట్ ప్రయోజనాలను చెల్లించడానికి భూముల అమ్మకం వంటి ప్రత్యామ్నాయ మార్గాలను కూడా ప్రభుత్వం పరిశీలిస్తోందని ఆయన సూచనప్రాయంగా తెలిపారు. సుమారు 17,000 మంది రిటైర్డ్ ఉద్యోగులకు రూ.980 కోట్ల వరకు బకాయిలు ఉన్నట్లు గతంలో సంఘాలు వెల్లడించిన నేపథ్యంలో మంత్రి ప్రకటనకు ప్రాధాన్యత ఏర్పడింది.

ఎల్ నినో ఎఫెక్ట్: కరెంట్, నీళ్లు పొదుపుగా వాడాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క విజ్ఞప్తి



మొదటిపేజీ తరువాయి – ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ, రాష్ట్రంలో నెలకొన్న ప్రస్తుత పరిస్థితులపై ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ సుమారు 20,000 మెగావాట్లకు చేరుకుందని, పెరుగుతున్న ఉష్ణోగ్రతల ప్రభావంతో విద్యుత్ వినియోగం భారీగా పెరిగిందని వివరించారు. గతంలో అక్టోబర్, నవంబర్ నెలల్లో చలి తీవ్రత అధికంగా ఉండేదని, అయితే ప్రస్తుతం వాతావరణ మార్పుల వల్ల పరిస్థితులు పూర్తిగా భిన్నంగా మారాయని ఆయన పేర్కొన్నారు. "ఒకప్పుడు చలి నుంచి రక్షణ పొందేందుకు ప్రయత్నించేవాళ్లం, కానీ నేడు ఎండల తీవ్రత నుంచి మనల్ని మనం కాపాడుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది" అని వ్యాఖ్యానించారు. వాతావరణంలో సంభవిస్తున్న ఈ అనూహ్య మార్పులే విద్యుత్, నీటి కొరతకు దారితీస్తున్నాయని అభిప్రాయపడ్డారు. ప్రతి ఒక్కరూ సహజ వనరుల విలువను గుర్తించి, వాటిని పొదుపుగా వినియోగించాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

అంగరంగ వైభవంగా సద్దుల బతుకమ్మ సంబరాలు





కుత్బుల్లాపూర్, అక్టోబర్18(విజన్ పక్షం దినపత్రిక): బతుకమ్మ పండుగ వేడుకల్లో భాగంగా సద్దుల బతుకమ్మ సంరాలు అంబరాన్నంటాయి. రాఘవేంద్ర కాలనీలో ఏర్పాటు చేసిన బతుకమ్మ వేడుకలు వైభవంగా జరిగాయి.భారీ బతుకమ్మలను ఏర్పాటు చేసి మహిళలు అంతా బతుకమ్మల చుట్టూ చేరి ఆడిపాడారు చేశారు. వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షురాలు కుంట పద్మ సిద్ధిరాములు అయిదు అడుగుల పొడవు ఉన్న పూల బతుకమ్మను తయారు చేసి ఈ కార్యక్రమానికి తీసుకువచ్చారు.భారీ బతుకమ్మ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కుంట సిద్ధిరాములు.జనరల్ సెక్రటరీ తోకల నగేష్ రెడ్డి,ఆలయ కమిటీ చైర్మన్ టి.రాజేశ్వర్,కార్యదర్శి రాజు,కార్యనిర్వహణ అధ్యక్షుడు దిడ్డి మల్లేష్,ఉపాధ్యక్షులు దిడ్డి రాములు,శ్రీనివాస్ రెడ్డి,రాజశేఖర్ రెడ్డి,ఆలయ కమిటీ మరియు వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు...ఈ బతుకమ్మ కార్యక్రమంలో మహిళలు, చిన్నపిల్లలు,కాలనీ పెద్దలు భారీ ఎత్తున పాల్గొని ఆడిపాడారు..

వాడవాడలా బతుకమ్మల సంబరాలు



చింతల్,అక్టోబర్18(విజన్ పక్షం): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం చింతల్ ప్రసూన నగర్ లో సద్దుల బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు.ప్రసూన నగర్ సంక్షేమ సంఘం వారి ఆధ్వర్యంలో సద్దుల బతుకమ్మ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి.సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సద్దుల బతుకమ్మ సంబురాల వైభవంగా నిర్వహించారు. అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ వేడుకల్లో కాలనీలోని మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆడిపాడారు.అనంతరం సంక్షేమ సంఘం నాయకులు మాడ్లడుతూ తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీక ఈ సద్దుల బతుకమ్మ అని అన్నారు. వేడుకల్లో సంక్షేమ సంఘ ముఖ్య నాయకులు కార్యవర్గం నాయకులతో పాటు కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం మున్సిపల్ అధికారుల వైఫల్యం



సురారం,అక్టోబర్18(విజన్ పక్షం): సూరారం గ్రామంలోని కట్టమైసమ్మ టెంపుల్ ఎదురుగా ఉన్న చెరువు పక్కన నిర్మించిన బతుకమ్మ ఘాట్‌ను అపరిశుభ్రంగా వదిలివేశారు.ఘాట్ లో నీరు కూడా లేకపోవడంతో బతుకమ్మలను అందులో విడిచిపెట్టేందుకు వచ్చిన ఆడపడుచులు తీవ్ర నిరాశ పడ్డారు.తెలంగాణ రాష్ట్ర పండుగ అయిన బతుకమ్మ వేడుకలకు కూడా బతుకమ్మ ఘాట్ ను శుభ్రపరచకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనం అని బీఆర్ఎస్ నాయకులు కోలా శ్రీకాంత్ ముదిరాజ్ ఆరోపించారు. మురుగు నీటిలోనే ఆడపడుచులు బతుకమ్మలను నిమజ్జనం చేయాల్సిన దుస్థితి దాపురించడం బాధాకరమని శ్రీకాంత్ అన్నారు. తెలంగాణ సంస్కృతికి ప్రతీక అయిన బతుకమ్మ పండుగకు కనీస సౌకర్యాలు కల్పించలేకపోవడం కాంగ్రెస్ ప్రభుత్వ పాలనా తీరుతెన్నులు ఎలాంటి స్థితిలో ఉన్నాయో అర్థం చేసుకోవచ్చన్నారు. సంబంధిత మున్సిపల్ అధికారులు దీనికి బాధ్యత వహించాల్సిన అవసరం ఉన్నా ఎవరికి ఏమీ పట్టనట్టు వ్యవహరించడం శోచనీయం అని అన్నారు. వెంటనే బతుకమ్మ ఘాట్‌ను శుభ్రపరిచి, డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేసారు. ప్రజా సమస్యల పరిష్కారానికి బీఆర్ఎస్ పార్టీ తరపున ప్రశ్నిస్తాం పరిష్కారం దక్కేవరకు పోరాడుతాం అని కోలా శ్రీకాంత్ ముదిరాజ్ అన్నారు. అధికారులు ఈ నిర్లక్ష్యానికి ఎలాంటి సమాధానం చెప్తారో వేచి చూడాలి.

శ్రీ మారుతి నగర్ కాలనీలో ఘనంగా శ్రీ చండీయాగం

బడంగ్పేట్, అక్టోబర్ 18 (విజన్ పక్షం): శ్రీ మారుతి నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక శ్రీ శక్తి గణపతి మండపం వద్ద కొలువుదీరిన శ్రీ దుర్గాదేవి అమ్మవారి సన్నిధిలో 'శ్రీ చండీయాగం' అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఎగిరిశెట్టి సైదులు – దంపతులు ముఖ్య యజమానులుగా వ్యవహరించి, అమ్మవారికి ప్రత్యేక పూజలు సమర్పించారు. లోక కళ్యాణం, కాలనీవాసుల ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం కలగాలని ఆకాంక్షిస్తూ వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ ఈ యజ్ఞాన్ని శాస్త్రోక్తంగా పూర్తి చేశారు. ఈ భక్తిశ్రద్ధల కార్యక్రమంలో కాలనీ నాయకులు, ప్రముఖులైన నాగరాజు దంపతులు, ఈశ్వర్ దంపతులు, కిషన్ దంపతులు, సతీష్ దంపతులతో పాటు కాలనీవాసులు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. యాగం అనంతరం భక్తులకు తీర్థప్రసాద వితరణ గావించారు.

దసరా వేడుకలకు సిద్ధమవుతున్న అల్మాస్‌గూడ శివాజీ చౌరస్తా..!



బడంగ్పేట్, అక్టోబర్ 18 విజన్ పక్షం): చెడుపై మంచి, అధర్మంపై ధర్మం సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే విజయదశమి వేడుకలకు అల్మాస్‌గూడలోని శివాజీ చౌరస్తా ముస్తాబవుతోంది. శ్రీరాముడు రావణాసురుడిపై సాధించిన విజయాన్ని స్మరించుకుంటూ ఏటా నిర్వహించే రావణ దహన కార్యక్రమానికి స్థానిక నాయకులు, గ్రామస్థులు సమాయత్తమవుతున్నారు. గతంలో అల్మాస్‌గూడలోని స్థానిక పాఠశాల ప్రాంగణంలో ఈ రావణ దహన కార్యక్రమాన్ని నిర్వహించేవారు. అయితే, రోజురోజుకూ పెరుగుతున్న ప్రజల సంఖ్యకు ఆ ప్రదేశం సరిపోకపోవడం, స్థలం చిన్నదిగా ఉండటంతో ప్రజల సౌకర్యార్థం ఈ ఏడాది వేదికను మార్చారు. కోమటికుంట సమీపంలో ఉన్న శివాజీ చౌరస్తా వద్ద ఈ కార్యక్రమాన్ని మరింత ఘనంగా నిర్వహించాలని గ్రామస్థులు ఏకగ్రీవంగా నిర్ణయించారు. విజయదశమి రోజున నిర్వహించే ఈ ప్రధాన ఘట్టానికి సంబంధించి శివాజీ చౌరస్తా వద్ద పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మైదానాన్ని శుభ్రం చేయించడం, ముందస్తు భద్రతా చర్యలు చేపట్టడం వంటి ఏర్పాట్లను ముమ్మరం చేశారు. ఈ ఏర్పాట్లలో భాగంగా ఏఐసీసీ విచార్ విభాగ్ కో-ఆర్డినేటర్ బోయపల్లి రాఘవేందర్ రెడ్డి నాయకత్వంలో నాయకులు స్థలాన్ని సందర్శించి పనులను దగ్గరుండి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఏఐసీసీ కో-ఆర్డినేటర్ బోయపల్లి రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూ --- "ప్రజలందరూ తమ కుటుంబ సమేతంగా పాల్గొని విజయదశమి పండుగను సంతోషంగా, భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలనే ఉద్దేశంతోనే ఈ విస్తృత ఏర్పాట్లు చేస్తున్నాం. చెడుపై మంచి సాధించే విజయ స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ ఆనందోత్సాహాల నడుమ ఈ వేడుకల్లో పాలుపంచుకోవాలి" అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దిండు శ్రీనివాస్ గౌడ్, అయ్యురువాయి కృష్ణారెడ్డి, నవారు ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు ఘన సన్మానం, నూతన వస్త్రాల పంపిణీ



మర్రిగూడ, అక్టోబర్ 18 (విజన్ పక్షం): భారత ప్రధాని నరేంద్ర మోదీ 76వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని బిజెపి ఓబిసి మోర్చా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'సేవా సంకల్ప అభియాన్'లో భాగంగా, దసరా పండుగను పురస్కరించుకుని ఎరగండ్లపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని పారిశుద్ధ్య కార్మికులు, పంచాయతీ సిబ్బందిని ఘనంగా సన్మానించి, నూతన వస్త్రాలను అందజేశారు. బిజెపి ఓబిసి మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి నారోజు కుమారస్వామి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గ్రామాల పరిశుభ్రత, ప్రజల ఆరోగ్య పరిరక్షణలో పారిశుద్ధ్య కార్మికులు అందిస్తున్న సేవలు ఎంతో అభినందనీయమని కొనియాడారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలను సేవా కార్యక్రమాల ద్వారా నిర్వహించడం, సమాజానికి విశేష సేవలందిస్తున్న కార్మికులను గౌరవించడం ఎంతో సంతోషకరమని తెలిపారు. దసరా పండుగ వేళ పారిశుద్ధ్య కార్మికులకు నూతన వస్త్రాలు పంపిణీ చేసి వారితో పండుగ ఆనందాన్ని పంచుకున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో బిజెపి కార్మిక విభాగం మర్రిగూడ మండల అధ్యక్షుడు పంగా యాదయ్య యాదవ్, బూత్ అధ్యక్షులు ఆవంచల దామోదర్, పంగా లక్ష్మణ్, దండేటికార్ మహేష్, పంగా శేఖర్, ఉప్పునూతల ఉపేందర్లతో పాటు పారిశుద్ధ్య కార్మికులు పాలకూర యాదయ్య, అందుగుల నర్సింహ, నారుమల్లు సైదమ్మ, అనిమళ్ల ముత్తమ్మ, కురంపల్లి లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జాతీయ అవార్డుకు దామరగిద్ద హనోక్ ఆనంద్ ఎంపిక



చేవెళ్ళ,అక్టోబర్ 18, విజన్ పక్షం దినపత్రిక: రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని దామరగిద్ద వార్డుకు చెందిన సామాజిక కార్యకర్త దామరగిద్ద హనోక్ ఆనంద్ ప్రతిష్టాత్మక 'డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జాతీయ పురస్కారాని'కి ఎంపికయ్యారు. సమాజానికి ఆయన నిస్వార్థంగా అందిస్తున్న విశిష్ట సేవలను గుర్తించిన బహుజన సాహిత్య అకాడమీ జాతీయ కమిటీ ఈ పురస్కారానికి ఆయనను ఎంపిక చేసింది. ఆదివారం హైదరాబాద్ నాచారంలోని అకాడమీ ప్రధాన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ చేతుల మీదుగా హనోక్ ఆనంద్ అధికారిక ఎంపిక పత్రాన్ని అందుకున్నారు.

పండగల సాయన్న జయంతిని ఘనంగా నిర్వహించి జయప్రదం చేద్దాం

ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్ పిలుపు



చేవెళ్ళ,అక్టోబర్ 18, విజన్ పక్షం దినపత్రిక: ఈ నెల 22న నిర్వహించనున్న పండగల సాయన్న జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించి, విజయవంతం చేయాలని ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్ పిలుపునిచ్చారు. శనివారం చేవెళ్ల మండల కేంద్రంలో నిర్వహించిన ముదిరాజ్ సంఘం నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జయంతి వేడుకల్లో ముదిరాజ్ సోదరులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. పండగల సాయన్న జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం సంతోషకరమని జిల్లా ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు తలారి మల్లేష్ అన్నారు. సాయన్న ఆశయాలు, సేవలను స్మరించుకుంటూ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో చేవెళ్ల మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు నర్సింహులు, యువజన అధ్యక్షుడు తెలుగు శ్రీనివాస్, ఊరడి నర్సింలు, ఊరడి రాంప్రసాద్, గోపాల్, శంకర్‌పల్లి అధ్యక్షుడు మైసయ్య, షాబాద్ అధ్యక్షుడు లింగం, మొయినాబాద్ నాయకులు యాదయ్య, గోపాల్, వెంకటేష్, జనార్ధన్ తదితర సంఘ నాయకులు పాల్గొన్నారు.

పూల జాతరతో పులకరించిన ఖానాపూర్.. అంబరాన్నంటిన సద్దుల బతుకమ్మ సంబరం



చేవెళ్ళ,అక్టోబర్ 18,విజన్ పక్షం దినపత్రిక: తెలంగాణ సంస్కృతి, ఆడపడుచుల ఆత్మగౌరవ ప్రతీక అయిన సద్దుల బతుకమ్మ సంబరాలు ఖానాపూర్ గ్రామంలో అత్యంత వైభవంగా, జరిగాయి. తీరొక్క పూలతో అందంగా తీర్చిదిద్దిన బతుకమ్మలను గ్రామ ప్రధాన చౌరస్తా వద్ద ఉంచి, మహిళలు, యువతులు చప్పట్లు కొడుతూ బతుకమ్మ పాటలతో సందడి చేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ సింధూర వెంకటేష్, మాట్లాడుతూ... తెలంగాణ ఆడబిడ్డల పెద్ద పండుగైన బతుకమ్మను గ్రామంలో ప్రజలంతా ఐకమత్యంతో, ఘనంగా నిర్వహించుకోవడం సంతోషదాయకమని పేర్కొన్నారు. గ్రామంలోని ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని గౌరమ్మ తల్లిని వేడుకున్నట్లు తెలిపారు. గ్రామ పెద్దల సహకారంతో వేడుకలకు ఎలాంటి లోటుపాట్లు రాకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఇందిరమ్మ, గ్రామ వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు మరియు గ్రామ మహిళలు తదితరులు పాల్గొన్నారు.

గోకవరంలో నామినేషన్లకు పోలీసుల కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు -- గోకవరం ఎస్ఐ హెచ్చరిక

గోకవరం, అక్టోబర్ 18 (విజన్ పక్షం): స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా గోకవరం మండలంలోని 20 ఎంపీటీసీ స్థానాలకు సంబంధించి నామినేషన్ల ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఈ మేరకు గోకవరం పోలీస్ స్టేషన్ ఎస్ఐ ఆదివారం ప్రజలకు, రాజకీయ పార్టీ నాయకులకు, ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు పలు సూచనలు జారీ చేశారు. నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, ఉపసంహరణ ప్రక్రియ గోకవరం మండల ప్రజా పరిషత్ కార్యాలయం (ఎంపీడీవో కార్యాలయం)లో నిర్వహించనున్నట్లు తెలిపారు.

నామినేషన్ల షెడ్యూల్ ఇదే..

ఈ నెల 21వ తేదీ నుంచి 23వ తేదీ వరకు ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లను స్వీకరించనున్నారు. 24వ తేదీన ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్ల పరిశీలన చేపట్టనుండగా, 27వ తేదీన నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ నిర్వహించనున్నారు.

నామినేషన్ కేంద్రం వద్ద ఆంక్షలు

నామినేషన్ ప్రక్రియ సందర్భంగా అభ్యర్థితో పాటు మరో ఇద్దరికి మాత్రమే నామినేషన్ గదిలోకి అనుమతి ఉంటుందని పోలీసులు స్పష్టం చేశారు. మిగిలిన వారు నామినేషన్ కేంద్రానికి



100 మీటర్ల దూరంలో ఉండాలని సూచించారు. ఎంపీడీవో కార్యాలయం వద్ద, పరిసర ప్రాంతాల్లో గుంపులుగా చేరడం, పోలీసులతో వాగ్వాదానికి దిగడం చేయరాదని కోరారు. పోలీసుల ముందస్తు అనుమతి లేకుండా బైక్ ర్యాలీలు, ఊరేగింపులు నిర్వహించడం, డీజేలు ఏర్పాటు చేయడం, బాణసంచా కాల్చడం నిషేధమని తెలిపారు. నామినేషన్ కేంద్రం వద్ద రోడ్డుపై వాహనాలను నిలిపి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించరాదని, పోలీసులు సూచించిన ప్రదేశాల్లోనే వాహనాలను పార్కింగ్ చేసుకోవాలని



సూచించారు.

అల్లర్లకు పాల్పడితే చర్యలు తప్పవు


నామినేషన్ కేంద్రం పరిసరాల్లో కర్రలు, రాళ్లు, ఇతర ఆయుధాలు తీసుకురావడం నేరమని పోలీసులు హెచ్చరించారు. ఎన్నికలకు సంబంధించి వాట్సాప్, ఫేస్‌బుక్ తదితర సామాజిక మాధ్యమాల్లో తప్పుడు వార్తలు, రెచ్చగొట్టే పోస్టులు, వ్యక్తులను లేదా రాజకీయ పార్టీలను కించపరిచే వ్యాఖ్యలు చేయరాదన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. నామినేషన్ల ప్రక్రియ జరిగే రోజుల్లో అక్రమ మద్యం విక్రయాలు, మద్యం సేవించి గొడవలకు పాల్పడటం వంటి చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు. అభ్యర్థులు, వారి అనుచరులు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని తప్పనిసరిగా పాటించాలని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై సంబంధిత చట్టాల ప్రకారం కేసులు నమోదు చేసి, అవసరమైన చర్యలు తీసుకుంటామని గోకవరం పోలీసులు హెచ్చరించారు. స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేందుకు ప్రజలు, రాజకీయ పార్టీ నాయకులు, అభ్యర్థులు పోలీసు శాఖకు సహకరించాలని ఎస్ఐ విజ్ఞప్తి చేశారు.

జగ్గంపేటలో అంగరంగ వైభవంగా ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ జన్మదిన వేడుకలు - టీడీపీ కార్యాలయంలో కేక్ కట్, స్వీట్ల పంపిణీ

జగ్గంపేటలో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ పుట్టినరోజు సందర్భంగా సేవా కార్యక్రమాలతో పుట్టినరోజు సంబరాలు - హాస్పిటల్స్ లో రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ

కాకినాడ జిల్లా, జగ్గంపేట, అక్టోబర్ 18 (విజన్ పక్షం): జగ్గంపేట ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు సభ్యులు, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు జ్యోతుల నెహ్రూ పుట్టినరోజు వేడుకలు జగ్గంపేట టౌన్ టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా జరిగాయి.ముందుగా స్థానిక రావులమ్మ నగర్ లోని టీడీపీ కార్యాలయంలో కేక్ కట్ చేసి ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ సంబరాలు చేసుకున్నారు. కార్యకర్తలకు, నాయకులకు స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం జగ్గంపేటలోని అన్ని హాస్పిటల్స్ కు వెళ్లి రోగులకు పండ్లు, బ్రెడ్

పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. మా అందరి అభిమాన నాయకుడు, మా ఆరాధ్య దైవం ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ పుట్టినరోజు సందర్భంగా జగ్గంపేట టౌన్ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించామని తెలిపారు. జగ్గంపేట నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తూ గడిచిన రెండున్నర సంవత్సరాలలో 600 కోట్ల రూపాయల అభివృద్ధిని నియోజకవర్గానికి అందించారని, సాగునీరు, త్రాగునీరు, రోడ్లు, మౌలిక వసతులు, విద్యా, వైద్యం అన్ని రంగాల్లో నియోజకవర్గాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్న నాయకుడికి ఆ వెంకటేశ్వర స్వామి ఆశీస్సులతో మరెన్నో పుట్టినరోజులు జరుపుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, జీను మణిబాబు, మారిశెట్టి భద్రం, దేవరపల్లి మూర్తి, కొత్త కొండబాబు, పాండ్రంగి రాంబాబు, వేములకొండ జోగారావు, గెద్దాడ సత్యవేణి, వెలిశెట్టి శీను, రాయి సాయి, పీల మహేష్, పలివెల యేసురాజు, నేదురి గణేష్, సాంబత్తుల చంద్రశేఖర్, ముక్కపాల బాబు, మంతెన సంకుబాబు, దుర్గపు ప్రకాష్, మురుకుర్తి రాజు, తుమ్మల కిషోర్ తదితరులు అధిక సంఖ్యలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



'రణబాలి' మూవీ రివ్యూ

విజయ్ దేవరకొండ బాక్సాఫీస్ పూనకం!

చరిత్ర పుటల్లో మరుగునపడిపోయిన వీరుల కథలను వెండితెరపైకి తీసుకొచ్చి, వారి పోరాటాలను నేటి తరానికి పరిచయం చేయడం గొప్ప ప్రయత్నం. ముఖ్యంగా బ్రిటిష్ పాలనలో ప్రజలు ఎదుర్కొన్న ఆకలి బాధలు, కరువు కాటకాలు, దోపిడీ, అణిచివేత వంటి అంశాలను భావోద్వేగాలతో మేళవించి చెప్పడం అంత సులభం కాదు. అలాంటి ఒక మరుగునపడిపోయిన వీరుడి జీవితాన్ని, పోరాటాన్ని వెనక్కి అవిష్కరించిన చిత్రమే 'రణబాలి'. విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న జంటగా నటించిన ఈ చిత్రానికి 'టాక్సీవాలా' ఫేమ్ రాహుల్ సాంకృత్యన్ దర్శకత్వం వహించారు. బలమైన చారిత్రక నేపథ్యం, మానవీయ భావోద్వేగాలు, తిరుగుబాటు స్ఫూర్తి కలగలిసిన ఈ సినిమా ప్రేక్షకులకు ఎలాంటి అనుభూతిని అందించింది? భారీ అంచనాలతో వచ్చిన ఈ సినిమా అంచనాలని అందుకుందా? రివ్యూలో చూద్దాం.

కథ

బ్రిటిష్ పాలనలో మద్రాసు ప్రాంతం తీవ్రమైన కరువును చూసిన కాలమది. రాయలసీమ ప్రాంతంలోని సింగనమల ప్రాంతానికి రక్షణగా ఉంటాడు భద్రమల్లన్న స్వామి. ఆ స్వామి ఆశీస్సులతో జన్మిస్తాడు రణబాలి (విజయ్ దేవరకొండ). తన పుట్టుకకు ఓ కారణం ఉంటుంది. తన ప్రజలను కరువు రాక్షసుడి నుంచి కాపాడటం తన కర్తవ్యం. బ్రిటిష్ జనరల్ ఆర్నాల్డ్ బోస్టో రూపంలో వస్తాడు ఆ కరువు రాక్షసుడు. దేశంలో లేని కరువును సృష్టిస్తాడు. ఆస్పత్రుల్ని అయిన ఈ దేశాన్ని ఆకలి చావులతో అలమటించేలా చేసి, ఇక్కడ పండిన ధాన్యాన్ని లాభాలను ఇంగ్లాండ్‌కు రూపాయ చేసే ప్రయత్నం చేస్తాడు. ఈ బ్రిటిష్ ఆర్నాల్డ్‌ను నుంచి రణబాలి తన ప్రజలను ఎలా రక్షించుకున్నాడు? ప్రజల ఆకలి తీర్చడానికి ఎలాంటి పోరాటం చేశాడనేది మిగతా కథ.

విశ్లేషణ

చరిత్రలో మరుగునపడిపోయిన ఓ వీరుడి కథ ఇది. ఒక వ్యక్తి పోరాటం వెనుక ఉన్న ప్రజల బాధలను, ఆ కాలపు నిజమైన పరిస్థితులను అద్భుతంగా చూపించడంలో ఎక్కడా, కథలో భాగంగా భద్రమల్లన్న జానపద గాథను దర్శకుడు మేళవించిన తీరు ఆద్యంతం ఆకట్టుకునేలా ఉంటుంది. 'రణబాలి'లో ప్రధానంగా ఆకట్టుకునేది కథాంశం. దాని వెనుక ఉన్న మానవీయ కోణం. బ్రిటిష్ పాలనలో ప్రజలు ఎదుర్కొన్న దారుణమైన పరిస్థితులను దర్శకుడు కొన్ని సన్నివేశాల్లో హృదయానికి హత్తుకునేలా చూపించారు. కరువు కారణంగా ఆకలితో అలమటించే ప్రజలు, తమ కుటుంబాలను కాపాడుకోవడానికి వారు పడే తపన, జీవనం కోసం చేసే పోరాటం ప్రేక్షకులను భావోద్వేగానికి గురిచేస్తాయి. తరచూ కనిపించే సన్నివేశాలు, ప్రజల కష్టాలు, వారి దుర్భర జీవితాలను ప్రతిబింబించే సన్నివేశాలు కథకు వాస్తవికతను తీసుకొస్తాయి. చరిత్రలోని ఒక చీకటి అధ్యాయాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చే ప్రయత్నం ఈ చిత్రానికి ప్రత్యేకతను తీసుకొస్తుంది. రణబాలి పుట్టుక, భద్రమల్లన్న నేపథ్యం, ఊర్లో జాతర, ఆర్నల్డ్ పుట్టుక, ఇంట్రో సాంగ్ వంటి అంశాలు ఆకట్టుకుంటాయి. ఇంటర్వెల్ ట్విస్ట్ కూడా బాగుంది. ఇంటర్వెల్ తర్వాత వచ్చే సన్నివేశాలు హత్తుకునేలా ఉంటాయి. ఇంటర్వెల్ సీక్వెన్స్ సినిమాకు మేజర్ హైలైట్‌గా నిలుస్తుంది. ఇంటర్వెల్ తర్వాత కూడా కథ మరింత తీవ్రతతో సాగుతుంది. బ్రిటిష్ వాళ్లు స్వాధీనం చేసుకున్న ఆహారాన్ని రణబాలి తిరిగి తీసుకొచ్చి ప్రజలకు అందించే ఎపిసోడ్‌లో అతని పోరాట స్ఫూర్తి మరో స్థాయిలో నిలుస్తుంది. ప్రీ క్లైమాక్స్‌లో వచ్చే ఎమోషనల్ సీన్స్ కదిలిస్తాయి. ఈ సన్నివేశాలు కథలోని మానవీయ భావోద్వేగాలను మరింత లోతుగా ఆవిష్కరిస్తాయి. ఒక చిన్న లోపాన్ని పక్కన పెడితే, ఓవరాల్‌గా ఈ సినిమా ప్రేక్షకులకు ఎలాంటి అనుభూతిని అందిస్తుంది? ప్రజల ఆకలి తీర్చడానికి ఎలాంటి పోరాటం చేశాడనేది మిగతా కథ.

విశ్లేషణ

చరిత్రలో మరుగునపడిపోయిన ఓ వీరుడి కథ ఇది. ఒక వ్యక్తి పోరాటం వెనుక ఉన్న ప్రజల బాధలను, ఆ కాలపు నిజమైన పరిస్థితులను అద్భుతంగా చూపించడంలో ఎక్కడా, కథలో భాగంగా భద్రమల్లన్న జానపద గాథను దర్శకుడు మేళవించిన తీరు ఆద్యంతం ఆకట్టుకునేలా ఉంటుంది. 'రణబాలి'లో ప్రధానంగా ఆకట్టుకునేది కథాంశం. దాని వెనుక ఉన్న మానవీయ కోణం. బ్రిటిష్ పాలనలో ప్రజలు ఎదుర్కొన్న దారుణమైన పరిస్థితులను దర్శకుడు కొన్ని సన్నివేశాల్లో హృదయానికి హత్తుకునేలా చూపించారు. కరువు కారణంగా ఆకలితో అలమటించే ప్రజలు, తమ కుటుంబాలను కాపాడుకోవడానికి వారు పడే తపన, జీవనం కోసం చేసే పోరాటం ప్రేక్షకులను భావోద్వేగానికి గురిచేస్తాయి. తరచూ కనిపించే సన్నివేశాలు, ప్రజల కష్టాలు, వారి దుర్భర జీవితాలను ప్రతిబింబించే సన్నివేశాలు కథకు వాస్తవికతను తీసుకొస్తాయి. చరిత్రలోని ఒక చీకటి అధ్యాయాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చే ప్రయత్నం ఈ చిత్రానికి ప్రత్యేకతను తీసుకొస్తుంది. రణబాలి పుట్టుక, భద్రమల్లన్న నేపథ్యం, ఊర్లో జాతర, ఆర్నల్డ్ పుట్టుక, ఇంట్రో సాంగ్ వంటి అంశాలు ఆకట్టుకుంటాయి. ఇంటర్వెల్ ట్విస్ట్ కూడా బాగుంది. ఇంటర్వెల్ తర్వాత వచ్చే సన్నివేశాలు హత్తుకునేలా ఉంటాయి. ఇంటర్వెల్ సీక్వెన్స్ సినిమాకు మేజర్ హైలైట్‌గా నిలుస్తుంది. ఇంటర్వెల్ తర్వాత కూడా కథ మరింత తీవ్రతతో సాగుతుంది. బ్రిటిష్ వాళ్లు స్వాధీనం చేసుకున్న ఆహారాన్ని రణబాలి తిరిగి తీసుకొచ్చి ప్రజలకు అందించే ఎపిసోడ్‌లో అతని పోరాట స్ఫూర్తి మరో స్థాయిలో నిలుస్తుంది. ప్రీ క్లైమాక్స్‌లో వచ్చే ఎమోషనల్ సీన్స్ కదిలిస్తాయి. ఈ సన్నివేశాలు కథలోని మానవీయ భావోద్వేగాలను మరింత లోతుగా ఆవిష్కరిస్తాయి. ఒక చిన్న లోపాన్ని పక్కన పెడితే, ఓవరాల్‌గా ఈ సినిమా ప్రేక్షకులకు ఎలాంటి అనుభూతిని అందిస్తుంది? ప్రజల ఆకలి తీర్చడానికి ఎలాంటి పోరాటం చేశాడనేది మిగతా కథ.

నటీనటుల నటన

రణబాలి పాత్ర విజయ్ దేవరకొండ కెరీర్‌లో ఒక మైలురాయిగా నిలిచిపోతుంది. సటుడిగా తనను మరో స్థాయిలో నిలబెట్టిన ప్రదర్శన కనబరిచారు. పాత్రలోని తీవ్రత, ఆవేశం, పోరాట స్ఫూర్తిని తెరపై అద్భుతంగా ఆవిష్కరించారు. యాక్షన్ సన్నివేశాలతో పాటు భావోద్వేగ సుదర్శనాల్లోనూ పాత్రకు పూర్తి న్యాయం చేశారు. రష్మిక మందన్న ఎక్కడా సహజంగా కనిపిస్తూ మెప్పించారు. విజయ్ దేవరకొండతో ఆమెకు సంబంధించిన సన్నివేశాలు అందంగా, హత్తుకునే భావోద్వేగాలతో సాగుతాయి. వీరిద్దరి మధ్య కెమిస్ట్రీ సినిమాకు మరో ఆకర్షణగా నిలుస్తుంది. ఈశ్వరి రావు పాత్ర కథను మరింత బలాన్ని తెచ్చింది. బ్రిటిష్ జనరల్ ఆర్నాల్డ్ పోస్టో పాత్రలో కావాల్సిన క్రూరత్వం కనిపించింది. కథలోని సామాజిక, చారిత్రక నేపథ్యానికి అనుగుణంగా మిగతా పాత్రలు కూడా తమ వంతు సహకారం అందించాయి.

టెక్నికల్ విభాగం

చరిత్రలో మరుగునపడిపోయిన ఒక వీరుడి కథను ఎంచుకోవడం, దాని వెనుక ఉన్న సామాజిక పరిస్థితులను తెరపైకి తీసుకురావడంలో రాహుల్ సాంకృత్యన్ అద్భుతమైన పనితీరు కనబరిచారు. ప్రజల బాధలు, తిరుగుబాటు స్ఫూర్తి, జానపద గాథ వంటి భిన్నమైన అంశాలను ఒకే కథలో చక్కగా మేళవించారు. కొన్ని భావోద్వేగ సన్నివేశాలను బాధ్యంగా తెరకెక్కించడం ఆయన దర్శకత్వ ప్రతిభకు నిదర్శనం. బ్రిటిష్ కాలం నాటి పరిస్థితులను సంభాషణలు, సంఘటనల ద్వారా చాస్తవానికి దగ్గరగా తీయడం అభినందనీయం. చారిత్రక నేపథ్యానికి తగిన నిర్మాణ విలువలతో సినిమాను గ్రాండ్‌గా నిర్మించారు. కెమెరా పర్వ్ కూడా టాప్ క్వాలిటీతో ఉంది. ఎడిటింగ్ ఇంకాస్త పదునుగా ఉండొచ్చు. అలాగే, ఆబయ్--ఆనంద్ రాస్తి చోట్ల మరింత బలంగా వేయాల్సిన ఆచ్చే ఆనబాణాన్ని చేజార్చుకున్నాడనిపించింది.

ప్లస్ పాయింట్స్

బలమైన చారిత్రక నేపథ్యం

విజయ్ దేవరకొండ పవర్‌ఫుల్ నటన

విజయ్ దేవరకొండ--రష్మిక మందన్న సన్నివేశాలు

ఇంటర్వెల్ సీక్వెన్స్, క్లైమాక్స్

భావోద్వేగ ఘట్టాలు

భద్రమల్లన్న జానపద గాథ

మైనస్ పాయింట్స్

ఆశించినంత వేగంగా సాగని కథనం

వేటపల్లి సంగీతం

ఫైనల్‌గా: చరిత్రలో జరిగిన సంఘటనలను కమర్షియల్ హంగులతో ప్రేక్షకులకు మరిచిపోని అనుభూతిని అందించే ప్రయత్నం చేశారు. విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న, రాహుల్ సాంకృత్యన్ కెరీర్‌లో ఈ చిత్రం గుర్తుండిపోయే స్థానాన్ని సంపాదించుకుంటుంది. బాక్సాఫీస్ వద్ద బాగుల వర్షం కురిపించే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి.

రేటింగ్: 3.5/ 5

రా అండ్ రస్టిక్ యాక్షన్ లవ్ స్టోరీతో రానున్న 'డానీ'.. నవంబర్ 13న గ్రాండ్ రిలీజ్!



టాలీవుడ్‌లో నైపుణ్యమైన కథాంశాలతో ప్రేక్షకులను అలరిస్తున్న యువ హీరో అతిష్ గాంధీ. టాలెంటెడ్ డైరెక్టర్ కళ్యాణ్‌జీ గోగణ కాంబినేషన్‌లో వస్తోన్న మోస్ట్ అంటిసిపేటెడ్ మూవీ 'డానీ'. గతంలో పీరియడ్ కలయికలో వచ్చిన 'నాటకం' సినిమా ఎలాంటి సంచలనం సృష్టించిందో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఇప్పుడు అదే జోరుతో అంతకుమించిన ఇంటన్సివ్ కంటెంట్‌తో ఈ కొత్త సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. రజ్వాన్ ఎంటర్టైన్మెంట్, కళ్యాణ్‌జీ కంటెంట్ పిక్చర్స్ పతాకాలపై ప్రముఖ నిర్మాత రిజ్వాన్ ఈ చిత్రాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. రామాంబికి, క్రమ, రా అండ్ రస్టిక్ జోనర్‌లో తెరకెక్కిన ఈ చిత్రంపై ట్రేడ్ సర్కిల్స్‌లో ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇప్పటికే విడుదలైన ఈ సినిమా ఫస్ట్ స్ట్రైక్ ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందనను సొంతం చేసుకుంది. సినిమాలోని బోల్డ్ కంటెంట్, రా అండ్ రస్టిక్ మేకింగ్ స్టైల్ యూత్‌ను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. సాధారణ ప్రేమ కథలకు భిన్నంగా, మనిషి జీవితంలో ఉండే అలవాట్లకు, అవసరం మనసారా కోరుకునే ప్రేమకు మధ్య జరిగే భావోద్వేగ సంఘర్షణే ఈ చిత్రానికి ప్రధాన హైలైట్ కానుంది. ఓ వ్యక్తి తన జీవితంలో అలవాటు చేసుకున్న వ్యసనాలు అతని గమ్యాన్ని ఎలా మార్చాయి? ఆ వ్యక్తి నిజమైన ప్రేమలో పడిన తర్వాత అవి జీవితంలో ఎలాంటి మెరుపులు మెరిపించాయి? ఈ రెండు విభిన్నమైన ధోరణుల మధ్య నలిగిపోయే పాత్రల ప్రయాణం ఎలా సాగిందనే ఆసక్తికరమైన అంశాలతో ఈ సినిమాను అత్యంత సహజంగా తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రంలో అతిష్ గాంధీ సరసన సౌత్ గుప్తా హీరోయిన్‌గా నటిస్తుండగా, సోనాల్ సింగ్, అజర్ ఖాన్ తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. మేకర్స్ తాజాగా విడుదల చేసిన రిలీజ్ డేట్ పోస్టర్ సినిమాపై క్యూరియాసిటీని మరింత పెంచేసింది. హీరో హీరోయిన్ల డిఫరెంట్ లుక్స్, పోస్టర్ డిజైన్ తీరు సినిమా నేపథ్యాన్ని కళ్లకు కట్టినట్లు చూపుతున్నాయి. ఈ చిత్రానికి టాలెంటెడ్ మ్యూజిక్ డైరెక్టర్ సాయి కార్తీక్ అందిస్తున్న బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ సినిమాకే ప్రధాన ఆకర్షణగా నిలవనుందని యూనిట్ వర్గాలు చెబుతున్నాయి. ఏకే ఆనంద్ సినిమాటోగ్రఫీ, మణికాంత్ ఎడిటింగ్ బాధ్యతలు అద్భుతంగా నిర్వర్తించారు. కొల్లి గోపాల కృష్ణ సమర్పణలో వస్తోన్న ఈ చిత్రానికి ఇమ్మి, సుధాకర్ గోడ సహ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. భార్గవి తోట ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా, రామ్ సుంకర మరియు కళ్యాణ్‌జీ గోగణ యాక్షన్ కొరియోగ్రఫీ అందించగా, సాయిరామ్ ఇల్లా కో-డైరక్టర్‌గా సేవలందించారు. ఏథమ్ స్టూడియోస్ సౌండ్ డిజైన్ చేయగా, కోటి పర్వ పబ్లిసిటీ డిజైన్స్ అందించారు. సాయి సతీష్ పీఆర్వోగా వ్యవహరిస్తున్నారు. అన్ని హంగులు పూర్తి చేసుకుంటున్న ఈ రా అండ్ రస్టిక్ రొమాంటిక్ క్రైమ్ డ్రామా 'డానీ' సినిమాను ప్రపంచవ్యాప్తంగా నవంబర్ 13న గ్రాండ్‌గా విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.



విజువల్ వండర్‌గా 'రామాయణం' కొత్త ట్రైలర్.. శ్రీరాముడిగా రణ్‌బీర్, రావణాసురుడిగా యశ్ అదుర్స్!




ఇండియన్ సినిమా చరిత్రలో భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న మైథలాజికల్ ప్రాజెక్ట్ 'రామాయణం' నుంచి మేకర్స్ కొత్త ట్రైలర్‌ను విడుదల చేశారు. కొంతసేపటి క్రితం నమిత్, కుమార్, సునయనా ఫొటోస్ ఇన్‌స్టాలో ఈ సినిమాను అందించిన ప్రముఖ దర్శకుడు నితేష్ తివారీ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా విడుదలైన ఈ రెండో ట్రైలర్ సినిమాపై అంచనాలను నెక్స్ట్ లెవెల్‌కి తీసుకెళ్లింది. ఈ చిత్రంలో బాలీవుడ్ స్టార్ హీరో రణ్‌బీర్ కపూర్ శ్రీరాముడిగా కనిపించనుండగా, బాలీవుడ్ సెన్సేషన్ సాయి పల్లవి సీతాదేవి పాత్రలో అమాయకత్వంతో మెప్పించనున్నారు. ఇక రాకింగ్ స్టార్ యష్ పవర్‌ఫుల్ రావణాసురుడి పాత్రలో భీకరంగా కనిపిస్తున్నాడు. ఇక ఈ చిత్రం మొదటి భాగం నవంబర్ 6, 2026న ప్రపంచవ్యాప్తంగా అట్టహాసంగా థియేటర్లలో విడుదల కానుంది. ఐమ్యాక్స్ ఫార్మాట్‌లోనూ విడుదలవుతున్న ఈ చిత్రం ఇండియన్ సినిమా స్థాయిని గ్లోబల్ స్థాయిలో నిలబెడుతుందని బాలా బ్రిలర్ స్పష్టం చేస్తోంది.

'కుంభ'లోని శక్తిని ఇప్పుడే తట్టిలేపాలని అనుకోవడం లేదు.. పృథ్వీరాజ్ బర్త్‌డేపై రాజమౌళి ట్వీట్

టాలీవుడ్ ఆగ్ర దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి తెరకెక్కిస్తున్న మాస్ట్ అంటిసిపేటెడ్ పాన్ వరల్డ్ మూవీ 'వారణాసి' సూపర్‌స్టార్ మహేష్ బాబు హీరోగా నటిస్తున్న ఈ చిత్రంలో మలయాళ స్టార్ హీరో పృథ్వీరాజ్ సుకుమారన్ ఒక శక్తివంతమైన పాత్రలో నటిస్తున్న విషయం తెలిసిందే. కాగా, తాజాగా పృథ్వీరాజ్ సుకుమారన్ పుట్టినరోజు సందర్భంగా రాజమౌళి ఆయనకు సోషల్ మీడియా వేదికగా ప్రత్యేకంగా చెప్పిన శుభాకాంక్షలు వైరలయ్యాయి. పృథ్వీరాజ్ పట్ల చాలా సుందరంగా రాజమౌళి చేసిన ట్వీట్ ప్రస్తుతం సినీ సర్కిల్స్‌లో ఆసక్తికరంగా ట్రెండ్ అవుతోంది. "హ్యాపీ బర్త్‌డే పృథ్వీ. ఈరోజు నీలోని 'కుంభ'ను తట్టిలేపాలని నేను అనుకోవడం లేదు. ప్రపంచంపై తనదైన ముద్ర వేయడానికి తలరాతతో ముడిపడి ఉన్న కుంభ జాతకుడు" అంటూ రాజమౌళి రాసుకొచ్చారు. 'కుంభ' అనేది 'వారణాసి' చిత్రంలో పృథ్వీరాజ్ పోషిస్తున్న పాత్ర పేరు కావడం విశేషం. ఈ చిత్రంలో మహేష్ బాబు సరసన ప్రియాంక చోప్రా జోనాస్ నటిస్తుండగా, పృథ్వీరాజ్ సుకుమారన్ రోల్ సినిమాకే హైలైట్‌గా నిలవనుందని సమాచారం.

వెంకీ, త్రివిక్రమ్ 'ఆదర్శ కుటుంబం' మరోసారి వాయిదా.?



టాలీవుడ్ ప్రేక్షకులతో పాటు విక్టరీ వెంకటేష్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న క్రేజీ కాంబినేషన్ సినిమా మరోసారి వాయిదా పడిన సంగతి తెలిసిందే. విక్టరీ వెంకటేష్ కథానాయకుడిగా, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'ఆదర్శ కుటుంబం' (మూస నంబర్ 47). ఈ సినిమాపై మొదటి నుంచే భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే, గతంలో సంక్రాంతి కానుకగా ఈ చిత్రం జనవరి 14న థియేటర్లలోకి రానుందని ఊదరగా, మళ్లీ ఏప్రిల్ 30న థియేటర్లలోకి రానుందని ప్రకటించారు. కానీ ఆ తేదీకి కూడా సినిమా రాకపోవడంతో అభిమానులు తీవ్ర నిరాశకు గురయ్యారు. సినిమా విడుదల వాయిదా పడటం అభిమానులను తీవ్ర నిరాశకు గురిచేసింది. సినిమా చివరి దశలో సాంకేతిక పనులు అనుకున్న సమయానికి పూర్తికాకపోవడంతోనే విడుదలను వాయిదా వేయాల్సి వచ్చిందని నిర్మాత నాగవంశీ చెప్పుకొచ్చారు.

Flat No: G-2, Mount Nasir Apartment, 6-1-57 to 61, Saifabad, Hyderabad9441221980